క్లుప్తంగా

తైక్వాండోలో ప్రతిభ

బి.కొత్తకోట : ఏషియన్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక రాఘవన్ స్కూల్ విద్యార్థి షాజిదా జేబా ప్రతిభ చాటింది. ఈనెల 12, 14, 15 తేదీల్లో హైదరాబాద్ ఇండోర్ స్టేడియంలో తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న సాజిదా జేబా వివిధ కేటగిరిల్లో విజయం సాధిస్తూ చివరకు సిల్వర్ మెడల్ దక్కించుకుంది.

కరాటే పోటీల్లో సత్తా


విద్యార్థులతో ప్రిన్సిపాల్, కోచ్

మదనపల్లె సిటీ : కర్నూలులో జరిగిన 12వ జాతీయస్థాయి కరాటే పోటీల్లో మదపల్లె ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో 26 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 5 బంగారు పతకాలు, 11 రజత పతకాలు, 10 క్యాంస పతకాలు సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు స్కూల్ చైర్‌పర్సన్ అమృతప్రసాద్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ షహనాజ్, కోచ్ సదాశివలు అభినందించారు.

స్వచ్ఛ ర్యాలీ

మదనపల్లె : స్వచ్ఛతా సాహీ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి బెంగళూరు బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా జెండాఊపీ ర్యాలీ ప్రారంభించగా కమిషనర్ ప్రమీల, మెప్మా మధు, మున్సిపల్, మెప్మా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి


ఊరేగింపులో విశ్వబ్రాహ్మణులు

కలికిరి : విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తామని పంచముఖ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు హేమాచారి అన్నారు. బుధవారం పంచముఖ విశ్వబ్రాహ్మణ సంఘం ప్రథమ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. శ్రీ వీరబ్రహ్మేశ్వరస్వామి జయంతి సందర్భంగా స్వామి చిత్రపటాన్ని ఘనంగా ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు అందరూ ఐక్యమత్యంతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మహేష్ ఆచారి, ప్రధాన కార్యదర్శి జయకుమార్, సభ్యులు బ్రహ్మాచారి, రమణాచారి, నాగరాజ ఆచారి, మోహనాచారి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కలకడ : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా, దోమలు వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు చేపట్టాలని ఎంపీడీఓ భానుప్రసాద్ ఆదేశించారు. బుధవారం మండలంలోని కలకడ పంచాయతీలో సర్పంచ్ ప్యారీజాన్ ఆధ్వర్యంలో జరుగుతున్న చెత్తసేకరణను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలని, అదేవిధంగా హోటళ్ల యజమానులు కూడ తడిచెత్త, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని కోరారు. చెత్త సేకరణ కేంద్రాల నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసి రైతులకు విక్రయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. చెత్తసేకరణ, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూఆక్రమణలను సహించేదిలేదు

మదనపల్లె రూరల్ : భూ ఆక్రమణలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. మండలంలోని పొన్నేటిపాలెం పంచాయతీలో గయాళు భూమి ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారం మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, పొన్నేటిపాలెం పంచాయతీలో గయాళు భూమిని పరిశీలించారు. ఆక్రమణదారులు తమకున్న 4.92 ఎకరాల డీకేటీ పట్టాతో పాటుగా మరో 2 ఎకరాల వరకు భూమి చదును చేసి ఉండటాన్ని గుర్తించారు. పట్టా భూమిని వదిలేసి, మిగిలిన భూమితో ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించి, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు.

గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు

గుర్రంకొండ : పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మదనపల్లె పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డెరెక్టర్ శ్రీనివాస్‌నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని గుర్రంకొండ, టి.పసలవాండ్లపల్లె పశువైద్యకేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాలికుంటువ్యాధిపై పాడిరైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. గాలికుంటు వ్యాధిపై అపోహలు తొలగించి తప్పనిసరిగా పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించే బాధ్యత పశువైద్యాధికారులపై ఉందన్నారు. పశువైద్య సిబ్బంది, అధికారులు పాడి రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వాల్మీకీపురం పశుసంవర్ధకశాఖ ఏడీ విశ్వేశ్వరరెడ్డి, పశువైద్యాధికారులు సునీల్, సలీమ్, అనూరాధ, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల ఇలా..
చదువులు సాగేదెలా?


ఉరుస్తున్న కొత్తవుడియం పాఠశాల భవనం


వరండాలో నిల్చున్న విద్యార్థులు

- వర్షానికి ఉరుసున్న ప్రభుత్వ బడులు
- పట్టించుకోని అధికారులు
- విద్యార్థులకు తప్పని పాట్లు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలో మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం వర్షాలు కురిశాయి. దీంతో పలుచోట్ల ప్రభుత్వ పాఠశాలల భవనాలు ఊరుస్తూ వర్షపునీటితో తడిసిపోయాయి. ఉదయం పాఠశాలలకు వచ్చిన విద్యార్థులు కూర్చునేందుకు వీలుకాకపోవడంతో ఆరుబయటే ఉన్నారు. ఉపాధ్యాయులు వరండాల్లో తరగతులను నిర్వహించారు. కొత్తవుడియం, శెట్టిపల్లె, రెడ్డివారిపల్లె పాఠశాలలు పైకప్పుల నుంచి వర్షం నీరు కారుతూ తడిసిపోయాయి. కొత్తవుడియం పాఠశాల పరిస్థితి దయనీయం. వర్షపు నీళ్లనీ తరగతి గదిలోకి వచ్చేస్తాయి. దీనితో వర్షం కురిసిందంటే విద్యార్థులకు చదువుకు అటంకాలే. బుధవారం ఇదే పరిస్థితి చోటుచేసుకుంది. వర్షం నీళ్లు నిండిపోవడంతో అక్కడి ఉపాధ్యాయురాలు మౌనిక విద్యార్థులతో వరండాలో తరగతిని నిర్వహించారు. దీనిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పాఠశాలకు మరమ్మతులు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిధులు కోరినా ఫలితం లేదు

బి.కొత్తకోట మండలంలోని దెబ్బతిన్న ఆరు పాఠశాలలకు మరమ్మతులు అవసరమని నిధులు మంజూరు చేయాలని విద్యాశాఖ అధికారులు 2024 అక్టోబర్‌లోనే ఉన్నతాధికారులకు నివేదించారు. వర్షం వస్తే ఉరుస్తాయని, తరగతుల నిర్వహణ కష్టమని సూచించారు. ఇందులో కొత్తవుడియం, రెడ్డివారిపల్లె, శెట్టిపల్లె, డేగానిపల్లె, గుడిపల్లె, బాలసానిపల్లె ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిపై కనీసం స్పందించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. మంగళవారం వర్షానికి పాఠశాలలు ఉరవడంతో విద్యాశాఖ అధికారులు బుధవారం మళ్లీ ప్రతిపాదనలు పంపారు.

ఇష్టానుసారంగా విద్యుత్ బిల్లులు

లబోదిబోమంటున్న వినియోగదారులు


కరెంట్ బిల్లు చూపుతున్న వెంకటరమణారెడ్డి

రామసముద్రం : ప్రభుత్వం ఇష్టానుసారంగా విద్యుత్ చార్జీలు పెంచితే తాము బతికేదెలా అని మినీ పరిశ్రమల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కంటే ప్రస్తుతం విద్యుత్ చార్జీలు భారీగా పెంచి తమ నడ్డి విరుస్తున్నారని వాపోతున్నారు. మండలంలోని పెద్దకురప్పల్లి పంచాయతీ మట్లవారిపల్లికి చెందిన వెంకటరమణారెడ్డి రైస్ మిల్ సర్వీస్ నంబర్ 5211800002922కు గతంలో నెలకు రూ.20వేల వరకు కరెంట్ బిల్లు వచ్చేది. ప్రస్తుతం అదే బిల్లు రెండింతలు, మూడింతలు వస్తుందని మండిపడుతున్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టుకోమని చెప్పి వాటిని పెట్టుకున్నప్పటి నుంచి చార్జీలు రెట్టింపు అయ్యాయని తెలిపారు. 2025 ఏప్రిల్ నెలో రూ.23,954, మేలో రూ.22,220లు, జూన్‌లో రూ.31,741, జూలైలో రూ.22,962లు బిల్లు వస్తే ఆగస్టు బిల్లు రూ.50,537 వచ్చిందని తాము ఎలా కట్టాలని వాపోయాడు. తమ మినీ పరిశ్రమలు పదేళ్లయ్యాక మరమ్మతులకు గురైతాయని, వాటి ఖర్చు భారీగా పెరిగిందన్నారు. దీనికి తోడు కరెంట్ చార్జీల్లో ఫిక్స్‌డ్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, ఎఫ్‌పీపీసీఏ అంటూ వేలల్లో బిల్లులు వస్తున్నాయన్నారు. పరిశ్రమలు మూత వేస్తే సుమారు 50 మంది వరకు ఉపాధి కోల్పోతారని పేర్కొన్నారు. దీనిపై తిరుపతి ఎస్ఈ, డీఈ, ఏఈకి ఫిర్యాదు చేశామని, ప్రభుత్వం, విద్యుత్ శాఖ మంత్రి స్పందించి చర్యలు చేపట్టాలని లేకుంటే మినీ పరిశ్రమలు మూత వేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు వైఎస్సార్‌సీపీ ధర్నా


మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

మదనపల్లె : వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు శుక్రవారం మదనపల్లె మెడికల్ కళాశాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ యువజన విభాగం మదనపల్లె నియోజకవర్గ అధ్యక్షులు హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మదనపల్లె సమన్వయకర్త నిసార్ అహ్మద్ ఆధ్వర్యంలో చలో మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించి పేదల వైద్యానికి, వైద్య విద్య సీట్లు పేద విద్యార్థులకు దక్కనీయకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మదనపల్లె మెడికల్ కళాశాలను ఏ మేరకు నిర్మాణం చేపట్టిందో, ఎన్ని కోట్ల నిధులు ఖర్చు చేసిందో తెలిసేలా ప్రజల్లోకి వెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ ముఖ్యనేతలు, అనుబంధ విభాగాల పార్టీ శ్రేణులు హాజరవుతున్నట్టు చెప్పారు. సమావేశంలో విద్యార్థి విభాగం అధ్యక్షులు అశోక్‌రాయల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొప్పల వెంకటరమణ, పవన్‌తేజ, నూర్, పూర్ణ, శివ, అనిల్, ఆశిష్ పాల్గొన్నారు.

'చలో మదనపల్లె' జయప్రదం చేయండి

పీలేరు : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం నిర్వహించనున్న చలో మదనపల్లె కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి సుంకర చక్రధర్ కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.8,500 కోట్లతో 17 మెడికల్ కాలేజీలు ప్రారంభించి కొన్నింటిని పూర్తి చేసిందని, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. పేద విద్యార్థులకు వైద్య విద్య చేరువ కావాలని మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కాలేజీ నిర్మాణాలు ప్రారంభిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి. ద్వారకనాథరెడ్డి, లోకనాథరెడ్డి, దావూద్, లోకనాథం, జాకీర్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

బి.కొత్తకోట : గర్భిణులు ఆహారంలో జాగ్రత్తలు పాటించడం, పోషకాహారం తీసుకోవాలని సీడీపీఓ భాగ్యమ్మ సూచించారు. పోషణ్ మాసోత్సవాలను బుధవారం ఆమె బి.కొత్తకోటలోని 2, 3, 4 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, గర్భిణులతో సమావేశాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు మంచి ఆలోచనలతో ఉల్లాసంగా ఉంటే సుఖ ప్రసవాలు జరుగుతాయన్నారు. ఎలాంటి పోషణ అందించాలి, అందులో ఎలా పోషకాలు ఉండాలి అన్నదానిపై వివరించారు. ప్రతి తల్లి ఈ విషయంలో పూర్తి అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఆకుకూరలు, చిరు ధాన్యాలతో తయారు చేసిన వంటలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయరాణి, అనసూయ, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. చక్కెర, నూనెల వాడకం తగ్గించాలని తద్వారా స్థూలకాయం పెరుగుదలను నివారించవచ్చని పేర్కొన్నారు. బాల్యదశ సంరక్షణ, విద్య, పురుషుల భాగస్వామ్యం, గర్భిణులు, బాలింతల ఆహారపు అలవాట్లు, వండే విధానంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హిజాద్‌ప్యారీ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు మెరుగైన వైద్య సేవలు


ప్రతిజ్ఞ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రమేష్‌బాబు, వైద్యసిబ్బంది

నిమ్మనపల్లె : స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు కొనసాగుతుందన్నారు. ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తల్లిబిడ్డ సేవలు, వయోవృద్ధులు, కిషోరబాలికల ఆరోగ్యపరీక్షలు, క్షయవ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు, మానసిక ఆయుష్ వైద్యసేవలు ప్రజలకు క్షేత్రస్థాయిలో అందేలా చర్యలు చేపడుతామన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్.ప్రత్యూష, సూపర్‌వైజర్లు, సీహెచ్ఓలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోట : మహిళలు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, గైనకాలజిస్టు హసీనా పర్వీన్ అన్నారు. బుధవారం ఆరోగ్య కేంద్రంలో మహిళల ఆరోగ్య పరిరక్షణమే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్య సమస్యలపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన వైద్య సదుపాయాన్ని అందించడం జరుగుతుందన్నారు. వైద్యులు దుర్గాదేవి, వెంకట్రామయ్య, వైద్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

సీట్ల భర్తీకి గడువు పొడగింపు

పీలేరు : ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సీట్ల భర్తీకి గడువు పొడగించినట్లు ప్రిన్సిపాల్ బాలమురళీప్రసాద్ తెలిపారు. నాలుగో విడత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 27వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 28న కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపించుకుని, 29 ఉదయం 9 గంటలకు ఒరిజనల్ సర్టిఫికెట్స్, రెండు ఫొటోలతో హాజరు కావాలన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న విద్యుత్ జేఏసీ నాయకులు

మదనపల్లె సిటీ : విద్యుత్ సంస్థలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మదనపల్లె డివిజన్ విద్యుత్ జెఏసీ చైర్మన్ సయ్యద్ జాఫర్‌వల్లి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో 20 సంవత్సరాలుగా కాంట్రాక్టు వర్కర్స్ పని చేస్తున్నవారిని సంస్థల్లో విలీనం చేయాలన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు వారి కుటుంబసభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు ఈపీఎఫ్, జీపీఎఫ్ చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఎనర్జీ అసిస్టెంట్‌లను సంస్థలో విలీనం చేసి పాత రెగ్యులేషన్స్ అమలు చేయాలని కోరారు. ఈ నెల 19, 20 తేదీల్లో సర్కిల్ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షలు, 22న సర్కిల్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రామలక్ష్మణ్, పతి, మురళీ, రామకృష్ణ, శేషాద్రినాగరాజు, రామచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామికవాదులపై కక్ష సాధింపు తగదు

పీలేరురూరల్ : ప్రజాస్వామికవాదులపై కక్ష సాధింపు తగదని ప్రజాసంఘాల నాయకులు సుధాకర్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీలేరులో ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు చేస్తున్న తమపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించడం, వేధించడం, ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటన చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ప్రశ్నించే గొంతులను నొక్కాలనుకోవడం సరైంది కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు అన్యాయం జరిగినపుడు కేసుల కట్టడంలో జాప్యం చేయడం తోపాటు కౌంటర్ కేసులు పెట్టడం సరికాదన్నారు. సీపీఐ నాయకులు టి.ఎల్. వెంకటేష్, మాలమహానాడు అధ్యక్షుడు దుర్గాప్రసాద్, వినోద్‌నాయుడు, విశ్వనాథ్, చెంగన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలు అరికట్టండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె రూరల్ : మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. బుధవారం ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల పనితీరు, అమలుచేస్తున్న పథకాలు, ప్రగతిపై అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ మండలంలో చెరువులు కబ్జాకు గురవుతున్నాయని, రేషన్‌కార్డుల జారీలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రెవెన్యూ సిబ్బంది తక్షణమే వీటిపై దృష్టిసారించాలన్నారు. మండలంలోని గ్రామపంచాయతీల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. చీకలబైలు జెడ్పీహైస్కూల్ స్థలంకు కేటాయించిన స్థలం ఆక్రమణ జరుగుతోందని తనకు ఫిర్యాదు అందిందని, జరగకుండా చూడాలన్నారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు వెలుగుచంద్ర, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నందినితాజ్, డిష్ రమణ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పార్టీ బలోపేతం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా కృషి చేసినప్పుడే వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సూచించారు. బుధవారం ఎమ్మెల్యే స్వగృహంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో చర్చించారు. రాజకీయ పరిస్థితులపై గ్రామాల్లో సమస్యలు, అంశాలపై ఆరా తీశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అందరూ ఏకమై కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో విఫలమైందన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకువె వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమకేసులు పెడుతున్నారని మండిపడ్డారు. అరాచకపు పాలనను అడ్డుకునేందుకు అలుపెరగని పోరాటాలు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుదాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మహేష్, నాయకులు శ్రీనివాసులు, కె.ఆర్. మల్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, శివారెడ్డి, కోటిరెడ్డి, రామమూర్తి, కరీమ్, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రెడ్డికుమార్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ పోరాట యోధుడు పెరియార్


పెరియార్‌కు నివాళులర్పిస్తున్న వీసీకే, బాస్ నాయకులు

మదనపల్లె రూరల్ : ఆత్మగౌరవ పోరాట యోధుడు పెరియార్ రామస్వామి అని విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే)పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ అన్నారు. బుధవారం పెరియార్ 147వ జయంతిని పురస్కరించుకుని స్థానిక బాస్ కార్యాలయంలో వీసీకే, బాస్ సంయుక్త ఆధ్వర్యంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. పెరియార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ దేవుడు, మతం పేరుతో పురోహితవర్గం చేసే మోసాలను, దోపిడీని పెరియార్ తీవ్రంగా ఎండగట్టారన్నారు. బ్రాహ్మణేతర కులాలకు కోటా పద్ధతి(రిజర్వేషన్లు) కోసం పెరియార్ పోరాటం చేశారన్నారు. ఉత్తరాది పెత్తనాన్ని ధిక్కరించి, దక్షిణాది హక్కులు, ఆత్మగౌరవం కోసం పెరియార్ నిర్మించిన ద్రవిడ ఉద్యమం భారత రాజకీయాల్లో పెనుసంచలనం సృష్టించిందన్నారు. దేశప్రజలకు పెరియార్ అందించిన బహుముఖ సేవలను, హేతువాద వైఖరిని గుర్తించిన యునెస్కో ఆయనను సౌత్ ఆసియా సోక్రటీస్‌గా ప్రకటించిందన్నారు. బాస్, వీసీకే నాయకులు ముత్యాలమోహన్, నీరుగట్టిరమణ, టీ.ఏ.పీర్‌బాషా, సాన్నికంటిరెడ్డెప్ప, కే.టి.శేఖర్, డేగానిరమణ, వై.గంగాధర్, రవిశంకర్, తలారికృష్ణ, బురుజురెడ్డిప్రసాద్, బి.నరసింహులు, ప్రశాంత్, చంద్ర, మురళి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీవైఎస్ ఆధ్వర్యంలో..

బహుజన యువసేన (బీవైఎస్) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో పెరియార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పునీత్ అధ్యక్షతన పెరియార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీవైఎస్ సభ్యులు జిలానిబాషా, నాగరాజు, శశికుమార్, హరికుమార్, వినయ్, శ్రీనాథ్, కార్తీక్, శ్రీనివాసులు, శశి, నవీన్, సంతోష్, జగదీష్, మౌలా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటాలి


క్రీడాకారులతో అధికారుల బృందం

నిమ్మనపల్లె : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని ఎంపీడీఓ రమేష్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీహైస్కూల్ (తెలుగు)లో మండలస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలను ఎంఈఓలు పద్మావతి, నారాయణ, హైస్కూల్ హెచ్ఎం అంజాద్‌అలీఖాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జిల్లా స్థాయికి వెళ్లేలా ప్రతిభ చూపాలన్నారు. బుధవారం జరిగిన పోటీల్లో బాలుర అండర్-17 వాలీబాల్ పోటీల్లో కేశవరెడ్డి పాఠశాల విన్నర్స్, రెడ్డివారిపల్లె హైస్కూల్ రన్నర్స్‌గా, కబడ్డీ అండర్-17 పోటీల్లో విన్నర్స్‌గా బాలినాయునిపల్లె హైస్కూల్, రన్నర్స్‌గా నిమ్మనపల్లె, అదేవిధంగా అండర్-17 బాలికల విభాగం కబడ్డీ పోటీల్లో నిమ్మనపల్లె విన్నర్స్‌గా, మోడల్ స్కూల్ రెడ్డివారిపల్లె రన్నర్స్‌గా, ఖోఖో పోటీల్లో విన్నర్స్‌గా కొమ్మిరెడ్డిపల్లె హైస్కూల్, రన్నర్స్‌గా ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో పీఈటీలు శారద, శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



తంబళ్లపల్లె : మెడికల్ క్యాంపు ప్రారంభిస్తున్న డాక్టర్ తేజస్విని, పీలేరు : రక్తదానం చేస్తున్న యువకుడు

పీలేరు రూరల్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక సంజయ్‌గాంధీ డిగ్రీ కళాశాలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తం దానం చేస్తే మరో ప్రాణాన్ని కాపాడిన వారు అవుతారన్నారు. బీజేపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రమణ, పురుషోత్తం, టెక్నీషియన్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె : ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75వ జన్మదిన సందర్భంగా గ్రామీణ పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఎస్ఎన్ఎస్ఈఏ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్వి తెలిపారు. బుధవారం సీహెచ్‌సీ ఆస్పత్రిలో మెడికల్ క్యాంపు ప్రారంభించారు. మెడికల్ క్యాంపులు 15 రోజుల పాటు అక్టోబర్ 2వతేదీ గాంధీ పుట్టినరోజు వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విక్రాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రక్తదానం

మదనపల్లె రూరల్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సేవ పక్వాడ్ జిల్లా కన్వీనర్ ఎల్లంపల్లె ప్రశాంత్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. రాజంపేట పార్లమెంటరీ బీజేపీ అధ్యక్షులు సాయిలోకేష్, నాయకులు బండి ఆనంద్, కోసూరిభవాని, కోసూరి కిరణ్, వరదారెడ్డి నారదరెడ్డి, పిల్లస్వామినాయక్ పాల్గొన్నారు.

కలకడ : ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని బీజేపీ పీలేరు నియోజకవర్గం కన్వీనర్ పాత్తూరి శ్రీకాంత్ అన్నారు. బుధవారం ప్రధానమంత్రి 75వ పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక శ్రీకామాక్షిసమేతసిద్దేశ్వరస్వామి ఆలయం సమీపంలో మొక్కలునాటి నీరు పోశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రకటన

అన్నమయ్య జిల్లా, రామసముద్రం మం॥ గుండ్లపల్లి గ్రామములో వెలసిన శ్రీ రామస్వామి దేవస్థానము, దేవాలయమును దేవాదాయ చట్టం ప్రకారం 30/1987 ప్రకారం రిజిస్ట్రేషన్ మరియు పబ్లికేషన్ చేయుటకు ఏవైనా అభ్యంతరాలు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపు రాయచోటిలోని జిల్లా దేవాదాయశాఖ, అన్నమయ్య జిల్లా వారికి తెలుపవలెను.

ఇన్‌స్పెక్టర్ యస్. శశికుమార్
దేవాదాయ శాఖ, మదనపల్లె